## క్లుప్తంగా

### గణేశ్ ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి

**నడిగూడెం :** మండల వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని స్థానిక ఎస్ఐ జి.అజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉత్సవ కమిటీలు విద్యుత్ కనెక్షన్ కోసం డీడీ తీయాలని, మండపాల ఏర్పాటు వద్ద రహదారులు బ్లాక్ చేయవద్దని, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. వివరాలకు 87126 86049 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

### అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

**హుజూర్‌నగర్ :** పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, గణితం బోధించేందుకు గాను అతిథి అధ్యాపకులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో పీజీ, డిగ్రీ కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని, దరఖాస్తులను 6వ తేదీలోపు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందజేయాలని ఆయన పేర్కొన్నారు.

### అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషిచేయాలి

**నేరేడుచర్ల :** ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల మెరుగుకు కృషి చేయాలని మండల విద్యాశాధికారి చ త్రునాయక్ అన్నారు. మంగళవారం నేరేడుచర్లలోనా ఎమ్మార్సీ భవనంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు బట్టు మధు, ఎల్, శ్రీనివాస్‌రావు అధ్యక్షతన కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎంఎన్‌ఓ సత్యనారాయణరెడ్డి, ఎల్.శ్రీనివాస్‌రావు, ఆర్‌పీలు ఆర్ శ్రీనయ్య, శ్రీధర్, యడవల్లి సత్యనారాయణలు.. ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఆర్‌పీలు శ్రీనివాస్‌రెడ్డి, పద్మ, ప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మునగాల :** రానున్న రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ కె.రమేష్‌దీనదయాళ్, తహసీల్దార్ వి.ఆంజనేయులు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మండలంలోని చెరువులు నిండి అలుగులు పోస్తున్నందున ఎవరూ కూడా చేపలు పట్టేందుకు వెళ్లవద్దని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఉండవద్దని సూచించారు. విద్యుత్ పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అత్యవసరమైతే గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలియజేయాలని కోరారు.

### వైభవంగా 16 రోజుల పండుగ



పూజల్లో పాల్గొన్న భక్తులు

**నేరేడుచర్ల :** మున్సిపాలిటీలో నూతనంగా నిర్మించిన శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం 16 రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మలికాపుత్తమ సమేత అయ్యప్పస్వామిలకు వేదపండితుడు వెంకటరమణశాస్త్రి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

### వరద బాధితులకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**అనంతగిరి :** మండలంలోని కిష్టాపురం గ్రామంలో వరద బాధిత కుటుంబాలకు గ్రామానికి చెందిన తూమటి శ్రీనివాస్‌రెడ్డి–రేణుక దంపతులు మంగళవారం బియ్యం పంపిణీ చేశారు. తన తల్లి స్వరాజ్యం జ్ఞాపకార్థంగా గ్రామంలో 95 మంది వరద బాధితులకు ఒక్కొక్కరికి 20 కిలోల చొప్పున బియ్యం అందజేసినట్లు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కత్రం జ్ఞానేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సత్యావతి నాగేశ్వర్‌రావు, జానకమ్మ, వెంకటప్పయ్య, సత్యావతి మోజేష్, బుడిగ సురేష్, రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

### వరద బాధితుల ఆకలి తీర్చుతున్న గ్రామస్తులు

**చిలుకూరు :** మండలంలోని నారాయణపురం గ్రామంలో చెరువు కట్ట తెగి సుమారు 50 ఇళ్లలోకి నీళ్లు చేరాయి. దీంతో బాధితులకు గ్రామానికి చెందిన పలువురు భోజన వసతి కల్పిస్తూ వారి ఆకలి తీర్చుతున్నారు. మంగళవారం మాజీ సర్పంచ్ బూర ఆంజనేయులు భోజనాలు ఏర్పాటు చేశారు. కాగా, వరద బాధితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబులు పర్యవేక్షిస్తున్నారు.

# ఇసుక మేటలు.. రైతన్నకు కన్నీళ్లు



పాలకవీడు : మీగడంపహాడ్‌తండా వద్ద కుప్పకూలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు



చిలుకూరులో వరి పొలంలో వరదలకు ఏర్పడిన ఇసుక మేటలు

**పాలకవీడు :** భారీ వర్షం మండలంలోని రాఘవపురం, మీగడంపహాడ్‌తండా గ్రామాలకు అపార నష్టాన్ని మిగిల్చింది. ఈ రెండు గ్రామాల మధ్య ఉన్న వేములూరు వాగుకు వరద పోటెత్తడంతో వాగు అంచులు కోతకు గురై పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సుమారు 11 వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, 50 స్తంభాలు, కిలోమీటర్ల మేర విద్యుత్ వైర్లు వరదలో కొట్టుకుపోయాయని సుమారు రూ.50 లక్షల వరకు విద్యుత్ అధికారులు అంచనా వేశారు. 70కి పైగా వ్యవసాయ మోటార్లు కొట్టుకుపోయినట్లు తెలిపారు. బ్రిడ్జిపై భారీ గొయ్యి పడడంతో మఠంపల్లి మీదుగా ఆంధ్రాకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగు పక్కనే నిర్మించిన శ్మశానవాటిక పూర్తిగా వరదలో కొట్టుకుపోయింది.



పాలకవీడు : మీగడంపహాడ్‌తండా వద్ద ధ్వంసమైన వేములూరు వాగుపై గల బ్రిడ్జి

**నీట మునిగిన వందలాది ఎకరాలు**

**మఠంపల్లి :** మండలంలో మంగళవారం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కిందితండా, చెన్నాయిపాలెం, హనుమంతులగూడెం, యాతవాకిళ్ల, వరదాపురంలో గల పంట పొలాల్లో ఇసుక మేటలు దర్శనమిచ్చాయి. ముఖ్యంగా యాతవాకిళ్ల వద్ద గల వేములూరు రిజర్వాయర్ ఉప్పొంగి ప్రవహించడంతో వాగు పరిధిలోని వందలాది ఎకరాల పొలాలు నీట మునిగాయి. విద్యుత్ మోటార్లు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. భారీ వాన రైతులకు కన్నీరు మిగిల్చినట్లు అయింది.

**పొలాల్లో ఇసుక మేటలు, రాళ్లు**

**చిలుకూరు :** వర్షానికి వరద ఉధృతి తగ్గి పొలాలు తేలుతున్నాయి. ప్రధానంగా వాగులు, చెరువుల పక్కన పొలాల్లో నీటి ఉధృతి తగ్గి ఇసుక మేటలు, రాళ్లు తేలాయి. దీంతో రైతులు ఏం చేయాలో అర్థం కాక అయోమయంలో ఉన్నారు.

### నష్ట పరిహారం అందించాలి



నేను అప్పు చేసి ఎకరాకు రూ. 15 వేల చొప్పున పెట్టుబడి పెట్టి రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. నాట్లు వేసి 20 రోజులకు పైగా అయింది. మూడు రోజులుగా కురిసిన భారీ వర్షానికి మా గ్రామంలోని నల్లచెరువు కట్ట తెగడంతో నా పొలం మొత్తం కొట్టుకుపోయింది. పొలంలో రాళ్లు తెలి ఇసుక మేటలు వేశాయి. నాతో పాటు మా గ్రామం, గోపాలపురం రైతులకు చెందిన సుమారు 100 ఎకరాలకు పైగా వరి పంట వరదకు కొట్టుకుపోయింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం అందించాలి.

– యరగాని నాగేశ్వరరావు, రైతు, బూరుగడ్డ, హుజూర్‌నగర్ మండలం

### వాన తెచ్చిన తంటా



బ్రిడ్జి పైకి ఎక్కి వెళ్తున్న విద్యార్థులు

**మునగాల :** మండలంలోని తాడువాయి శివారులో గల గురప్ప వాగుపై బ్రిడ్జి నిర్మిస్తున్నందున ఏర్పాటు చేసిన ఫార్మేషన్ రోడ్డు వరద ఉధృతికి మూడు రోజుల క్రితం కొట్టుకుపోయింది. దీంతో మునగాల– తాడువాయి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. స్కూల్ బస్సులు, ట్రాక్టర్లు ప్రయాణించేందుకు అనువుగా లేదు. గ్రామస్తులు బ్రిడ్జిపై కాలినడకన ప్రయాణించేందుకు మట్టి పోసి రాకపోకలు సాగించారు. విద్యార్థులు, ప్రజలు బ్రిడ్జిపైకి ఎక్కేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు.

### డొంక దారి ధ్వంసం



వరద నీరు వెళ్లేందుకు కాల్వ తీస్తున్న రైతులు

**మోతె :** మండలంలోని రావిపహాడ్ గ్రామ శివారులో కుమ్మరికుంటకు దిగువన ఉన్న డొంక దారి భారీ వర్షానికి ధ్వంసమైంది. దీంతో మంగళవారం రైతులు డొంక వద్ద వరద నీరు వెళ్లేందుకు కాల్వ తీశారు. అధికారులు, స్థానిక ఎమ్మెల్యే చొరవ చూపి ధ్వంసమైన డొంక దారికి మరమ్మతులు చేయించాలని కోరారు. రైతులు పగిళ్ల ఉప్పలయ్య, నిమ్మల మల్లయ్య, నిమ్మల వెంకటనర్సయ్య, ఎలుగు మల్లయ్య, నిమ్మల నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### చెరువుల కట్టలను పునరుద్ధరించాలి

**హుజూర్‌నగర్‌రూరల్ :** తుఫాన్ కారణంగా తెగిపోయిన చెరువుల కట్టలను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని తాజా మాజీ జెడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని గోపాలపురం, బూరుగడ్డ చెరువులను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులు, కుంటలు తెగి వరదలకు నష్టపోయిన రైతులను ఎకరాకు రూ. 25 వేల చొప్పున పంట నష్టం అందించాలని కోరారు. ఆయన వెంట తాజా మాజీ ఎంపీటీసీ చీకూరి రాజారావు, మండల యూత్ అధ్యక్షుడు వీరమల్ల సుందరయ్య, హుస్సేన్, నారాయణ, కోటయ్య, సత్యనారాయణ, మౌలానా, వెంకటేశ్వరరావు, గోవింద్, రైతులు ఉన్నారు.

### రుణమాఫీ సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలి

**నేరేడుచర్ల :** రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ చేపడుతున్న రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వేలో వివరాలు త్వరితగతిన నమోదు చేయించుకోవాలని హుజూర్‌నగర్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రవి అన్నారు. మంగళవారం నేరేడుచర్లలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో కుటుంబ సభ్యుల నిర్ధారణ నమోదును పరిశీలించి మాట్లాడారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో 9016 మంది రైతులు కుటుంబ నిర్ధారణ చేసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు 4500 మంది మాత్రమే నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి జావేద్, వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు నాగరాజు, అన్వేష్, నిర్మల, స్నేహ ఉన్నారు.

**రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**కోదాడరూరల్ :** రుణమాఫీ కానీ రైతులు ఆయా గ్రామాల్లో చేపడుతున్న కుటుంబ నిర్ధారణ సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలని కోదాడ ఏడీఏ యల్లయ్య సూచించారు. మంగళవారం కాపుగల్లు రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరై రుణమాఫీ కాని రైతుల నుంచి కుటుంబ నిర్ధారణ దరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. మండలంలో భారీ వర్షానికి నష్టపోయిన పంటపొలాల రైతును గుర్తించి పంటనష్టం వివరాలను సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ పాలెం రజిని, పీఏసీఎస్ చైర్మన్ నంబూరి సూర్యం, ఏఈఓ సల్మా, ఝాన్సీ, మహేష్, రైతులు ఉన్నారు.

## తేరుకుంటున్న తొగర్రాయి, కూచిపూడి



కోదాడరూరల్ : కూచిపూడిలో బాధితులకు భోజనం అందజేస్తున్న ఫ్రెండ్స్ యూత్ సభ్యులు



వరద ఉధృతి తగ్గడంతో బయటపడ్డ గేదె కళేబరం

**కోదాడరూరల్ :** అంతరగంగా వరద ఉధృతికి తీవ్రంగా నష్టపోయిన మండలంలోని తొగర్రాయి, కూచిపూడి గ్రామాలు తేరుకుంటున్నాయి. తొగర్రాయిలో 450 ఇళ్లల్లోకి, కూచిపూడిలో 420 ఇళ్లల్లో చేరిన నీరు తగ్గడంతో బాధితులు ఇళ్లల్లో చేరిన బురదను తొలగించుకుంటున్నారు. తొగర్రాయిలో వరదకు కొట్టుకుపోయిన రైతు అమరనేని వెంకటేశ్వరరావుకు చెందిన రెండు గేదెలు బయటపడ్డాయి. కూచిపూడిలో ఎస్సీ, ముస్లిం కాలనీ ప్రజలకు తమ్మరకు చెందిన ఫ్రెండ్స్ యూత్, స్థానిక ప్రజలు భోజనం ఏర్పాటు చేశారు. తొగర్రాయి, కూచిపూడి, గణపవరంలో దాదాపుగా 2 వేల ఎకరాల్లో పంట నీటి మునిగినట్లు అధికారుల లెక్కల్లో తేలింది.

**మూడు రోజులు అంధకారంలోనే..**

వరద ఉధృతికి ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో తొగర్రాయి శనివారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు అంధకారంలోనే ఉంది. గ్రామస్తులు, విద్యుత్ అధికారులు మంగళవారం మరమ్మతు చేపట్టడంతో ఎట్టకేలకు విద్యుత్ సరఫరా వచ్చింది. ఈ మూడు రోజులు విద్యుత్ లేక సరైన వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు.

**గణపవరాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే..**

గణపవరంలో వరద ఉధృతికి దెబ్బతిన్న పంట పొలాలను, చెరువు అలుగు, కట్టను మంగళవారం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి పరిశీలించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు.

## గూనలు తేలి.. రాకపోకలు నిలిచి

**నేరేడుచర్ల :** గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి నేరేడుచర్ల – గంటవారిగూడెం వెళ్లే రహదారిపై గల కాలువపై గునలు తెలాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో వెళ్లే గంటవారిగూడెం, తెలగరామయ్యగూడెం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు చేపట్టడం లేదు. తక్షణమే గునలు తొలగించి కల్వర్టు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నేరేడుచర్ల - గంటవారిగూడెం రోడ్డులో తేలిన గూనలు

### పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

**నడిగూడెం :** మండలంలోని కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ కట్ట తెగడంతో వరద నీటికి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సాగర్ ఎడమ కాల్వ కట్ట తెగిన ప్రదేశాన్ని ఆమె పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆమె వెంట కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, నాయకులు దొడ్డా వెంకటయ్య, కంబాల శ్రీనివాస్, శ్రీహరి, తదితరులు ఉన్నారు.

### సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలి

**హుజూర్‌నగర్ :** జిల్లాలో ఈ నెల 11, 12,13 తేదీల్లో నిర్వహించబోయే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది వీరులను త్యాగం చేసిన చరిత్ర కమ్యూనిస్టులదని, ఆ వీరుల త్యాగాలను స్మరించుకునేందుకు ప్రభుత్వమే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించాలని ఆయన కోరారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, పోకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితా క్షుణ్ణంగా పరిశీలించాలి

**గరిడేపల్లి :** ఓటరు జాబితా క్షుణ్ణంగా పరిశీలించాలని మండల ప్రత్యేక అధికారి శ్యామ్‌సుందర్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వార్డుల వారీగా కుటుంబాల ఓట్లు ఒకే బూతులో ఉండేవిధంగా సరిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, పంచాయతీ సెక్రటరీలు నాగేశ్వరరావు, సైదా, ఫీల్డ్ అసిస్టెంట్ మేకపోతుల సరితగౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బంది నర్సిరెడ్డి, సతీష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.


### విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

**గరిడేపల్లి :** శ్రీఫౌండేషన్ నిర్వాహకులు కందుల ప్రపూర్ణ రామకృష్ణారెడ్డి కూతురు కందుల పూర్విక రామ్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షం.. మిగిల్చిన నష్టం

- కోదాడలో నాలాల ఆక్రమణతో సెల్లార్లలో చేరిన వరద నీరు
- ఫర్టిలైజర్ దుకాణాల్లో తడిసిన ఎరువులు, విత్తనాల బస్తాలు

**కోదాడ :** మునుపెన్నడూ లేని విధంగా శనివారం రాత్రి కోదాడలో కురిసిన భారీ వర్షానికి పట్టణంలోని సెల్లార్లలో గల పలు దుకాణాల్లో నీరు చేరి తీవ్రంగా నష్టం వాటిల్లింది. ముఖ్యంగా మేళ్లచెరువు రోడ్డులో ఉన్న మూడు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఒక్కొక్కరు 50 నుంచి 60 లక్షల రూపాయలు నష్టపోయారు. మాధురీ ఫర్టిలైజర్స్, భవానీ ఫర్టిలైజర్స్, సింధూర సీడ్స్ దుకాణ యజమానులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఎరువులు, విత్తనాల బస్తాలు తడిసి పనికిరాకుండా పోయాయి. అయితే ఎర్రకుంట పొంగడంతో భవానీనగర్ నుంచి నీరు మేళ్లచెరువు రోడ్డుకు చేరింది. ఇక్కడ నాలా అక్రమణకు గురికావడంతో పాటు అడ్డంగా డివైడర్లు ఉండడంతో నీరు మొత్తం దుకాణాల్లోకి చేరి అపార నష్టం జరిగింది. ఇదే ప్రదేశంలో ఉన్న గఫూర్ మెకానిక్ దుకాణంపై వరదనీరు పడడంతో అందులో ఉన్న మిషనరీ మొత్తం వరదకు కొట్టుకుపోయి దాదాపు రూ. 25 లక్షల నష్టం వాటిల్లింది.



వరద నీటిలోనే ఫర్నిచర్ దుకాణం



కోదాడలోని ముస్లిం మైనార్టీ పాఠశాలలో తడిసిన బియ్యం బస్తాలు

**సూర్యాపేట రోడ్డులోనూ ఇదే పరిస్థితి..**

పట్టణంలోని రంగా థియేటర్ నుంచి శ్రీనివాస థియేటర్ వరకు సెల్లార్లలో ఉన్న దుకాణాల లోపలికి భారీగా వరదనీరు చేరడంతో ఇక్కడ కూడా తీవ్ర నష్టం జరిగింది. పుడ్డీస్ బెకరీలోకి నీరు చేరడంతో ఫ్రిజ్‌లు ఇతర సామగ్రి పాడైపోయాయి. రెడిమేడ్ దుకాణంలో దుస్తులు ముద్దయ్యాయి. పాపిరెడ్డి ప్లాజా, కరూర్ వైశ్యా బ్యాంక్ సెల్లార్‌లలో నీరు చేరడంతో అందులో ఉన్న దుకాణాలు, హోటళ్ల యజమానులు నష్టపోయారు. సమీపంలోని ఫర్టిలైజర్స్ దుకాణం సెల్లార్‌లోకి నీరు రావడంతో ఎరువుల, విత్తనాల బస్తాలు తడిసి ఎందుకు పనిరాకుండా పోయాయి. కాశీనాథం ఫంక్షన్ హాల్ సమీపంలో ఉన్న ఎలక్ట్రికల్ దుకాణంలోకి నీరు చేరడంతో విలువైన గృహోపకరణలు, కంరెంట్ మోటార్లు పాడయ్యాయి. ఇక్కడ ఉన్న డ్రైన్‌ను వెంగమాంబ వైన్స్ యజమాన్యం పూర్తిగా మూసివేసి దుకాణం ఏర్పాటు చేయడంతో నీరు కిందకు వెళ్లకపోవడం, కింది వైపు నాలాను పూర్తిగా ఆక్రమించడంతో ఇలా జరిగింది. క్రాంతి కళాశాల నుంచి లాల్ బంగ్లా పక్కన ఉన్న ఈ నాలాను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, ఆక్రమణలను తొలగించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



మేళ్లచెరువు రోడ్డులోని ఫర్టిలైజర్ దుకాణంలో తడిసిన ఎరువుల బస్తాలు

### దాదాపు రూ. 40 లక్షల నష్టం వాటిల్లింది



మేళ్లచెరువు రోడ్డులో నాలా ఆక్రమణతో పాటు డివైడర్లు నీరు వెళ్లకుండా అడ్డుకోవడంతో మా దుకాణంలోకి నీరు వచ్చింది. ఎరువుల బస్తారు, విత్తనాల బస్తాలు పూర్తిగా తడిసి పాడైపోయాయి. గోదాములో ఉన్న ఎరువులు కూడా పాడైపోయాయి. దాదాపు రూ.30 నుంచి 40 లక్షల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఆత్మకూరి రంగారావు, భవానీ ఫర్టిలైజర్స్ యజమాని

### ప్రభుత్వం ఆదుకోవాలి



భవానీనగర్‌లో నాలా ఆక్రమణలతో నీరు ఇళ్ల మీదకు వచ్చింది. అక్కడి నుంచి రోడ్డు మీదుగా మా దుకాణాల్లోకి చేరింది. డివైడర్లు రోడ్డు ఉన్న చోట పగులగొట్టకుండా ఇతర ప్రాంతాల్లో పగులగొట్టారు. దీంతో తీవ్ర నష్టం జరిగింది. మిషనరీ మొత్తం పాడైపోయింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

– గఫూర్ మేస్త్రి, వర్క్‌షాపు యజమాని

# వరద బాధితులకు భరోసాగా..

- సాగర్ సిమెంట్ పరిశ్రమ తరఫున బియ్యం అందజేసిన మంత్రి ఉత్తమ్



వరద బాధితులకు బియ్యం, సరుకులు పంపిణీ చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**మఠంపల్లి :** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి వరదనీరు చేరింది. దీంతో ఇబ్బందులు పడుతున్న వరద బాధితులకు స్థానిక సాగర్ సిమెంట్స్ పరిశ్రమ తరఫున మంగళవారం 125 కుటుంబాలకు 25 కేజీ బియ్యం, నిత్యావసర సరుకులను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పరిశ్రమ వారిని అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా మంజీనాయక్, మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, పరిశ్రమ అధికారి తూడి వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

# అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- కోదాడ ఎమ్మెల్యే పద్మావతి



అనంతగిరి : గోండ్రియాలలో వరద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

**అనంతగిరి :** భారీ వర్షాలతో ముంపుకు గురైన గ్రామాల ప్రజలు అధైర్య పడవద్దని, తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. అనంతగిరి మండలంలో ముంపుకు గురైన గోండ్రియాల, చనుపల్లి, క్రిష్టాపురం గ్రామాల్లో మంగళవారం ఆమె పరిశీలించి వరద బాధితులను పరామర్శించారు. గోండ్రియాలలో పూర్తిగా ధ్వంసమైన తిరుపతమ్మ, గంగమ్మ ఆలయాలు, పాఠశాల ప్రహరీ, శ్మశాన వాటికను, గోండ్రియాల గ్రామం నుంచి రంగాపురం గ్రామానికి మధ్య గల రోడ్డును పరిశీలించి మాట్లాడారు. మండలంలో వర్షాల నష్టాన్ని అంచన వేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో విద్యుత్ లైన్లు పునరుద్ధరించాలని ఆదేశించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. సర్వం కోల్పోయి పునరావాస కేంద్రాల్లో ఉంటున్న ప్రజలకు తాగు నీరు, ఆహార పదార్థాలు అందించాలన్నారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుక్కరి సంధ్యారాణిపుల్లారెడ్డి, తహసీల్దార్ కె.హిమబిందు, ఎంపీడీఓ సుష్మ, విద్యుత్ ఏఈ కీర్తిరెడ్డి, ఏఓ అందె సతీష్, ఎస్ఐ నవీన్‌కుమార్, కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, పుల్లారెడ్డి, వాసు, కొండయ్య, రాఘవారెడ్డి, వినయ్, జ్ఞానేందర్‌రెడ్డి, కిరన్‌రెడ్డి, రామకోటయ్య, బాపూజీరెడ్డి ఉన్నారు.

**బాధిత కుటుంబాలను ఆదుకుంటాం**



చిలుకూరు : నారాయణపురంలో తెగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

**చిలుకూరు :** భారీ వర్షం ప్రభావంతో నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. చిలుకూరు మండలంలోని నారాయణపురంలో వర్షానికి తెగిన చెరువు కట్టను, రోడ్డును మంగళవారం ఆమె పరిశీలించి బాధిత కుటుంబాలతో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో జరిగిన నష్టాన్ని అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. తాత్కాలికంగా ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు వసతి కల్పించడంతో పాటు భోజన వసతి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చెరువు కట్ట, రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఐబీ డీఈ, ఏఈలు స్వప్న, మాసన, గ్రామ కార్యదర్శి కవిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా సహాయక చర్యలు

**హుజూర్‌నగర్ :** మున్సిపాలిటీ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలను మున్సిపల్ అధికారులు ముమ్మరం చేశారు. దద్దనాల చెరువు కాలనీ, శివాలయం బజారులలో మురుగు నీరు నిలిచిన ప్రాంతాలను శుభ్రం చేయించారు. ఎన్నెస్పీ కాలువల నీరు వెళ్లేవిధంగా ప్రొక్లయిన్‌తో పూడిక తీయించారు. వరద ప్రవహించిన బజార్లలో బ్లీచింగ్ చల్లించారు. మురుగు నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. గోవిందపురం వెళ్లే దారిలో తెరిచిన నాలా వద్ద ప్రత్యామ్నాయ రోడ్డు వేసి రాకపోకలను పునరుద్ధరించారు. గోవిందపురం ప్రాథమిక పాఠశాలలో బురద, చెత్తాచెదారాన్ని తొలగించారు. మఠంపల్లి అడ్డ రోడ్డులో నాలాల్లో పూడిక తీత, కంప, చెత్తాచెదారం తొలగింపు పనులు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సహాయక చర్యలపై సమీక్ష నిర్వహించారు.



జేసీబీతో పూడిక తీయిస్తున్న అధికారులు

### బూరుగడ్డ ఆలయంలో క్షేత్రపాలకుడికి ఆకుపూజ

**హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, ఆంజనేయస్వామికి పంచామృతాలు, 108 తమలపాకులతో అభిషేకం, ఆకుపూజ, గంధ సింధూరం, మన్యసూక్త పారాయణం, శ్రీరామ, ఆంజనేయ అష్టోత్తర శతనామావళి, అలంకరణ, తీర్థప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది యరగాని కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, రమేష్, ఉపేందర్ భక్తులు పాల్గొన్నారు.

### సేవలో ముందుండాలి

**మునగాల :** యువత సామాజిక సేవలో ముందుండాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలంపల్లి సుధాకర్‌గౌడ్ అన్నారు. గత మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున మండలంలోని ముకుందాపురం శివారులో ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం ఆయన అన్నదానంతో పాటు పాలు, పండ్లు అందజేశారు.

**నిత్యావసర సరుకులు అందజేత..**

మండలంలోని ఇందిర అనాథ వృద్ధాశ్రమం, కోదాడలోని శనిగల రాధాకృష్ణ మానసిక వికలాంగుల ఆశ్రమానికి వ్యాపారవేత్త నల్లపాటి శ్రీనివాస్– ప్రమీల దంపతులు తమ కుమారుడు వీరవెంకట ఉమామహేష్–సాయిమేఘన దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రూ.పదివేల విలువ గల నిత్యావసర సరుకులు అందజేశారు.